



విరిసిన ఉత్సాహం
కడియం పల్ల వెంకన్న నర్సరీలో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన మొక్కల అమరిక

నేతన్న నేస్తం అందేదెన్నడో?

- ఎదురు చూస్తున్న కార్మికులు
- 'చేనేత'కు కొరవడిన సర్కారు సహకారం
- అమలుకు నోచుకోని హామీలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మగ్గాలను నమ్ముకుని జీవిస్తున్న వారికి గత వైసిపి పభుత్వం 'నేతన్న నేస్తం' పేరుతో ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించింది. నేతన్న నేస్తం ఆర్థిక సాయం ముడి సరుకు, ఇతర అవసరాలకు ఉపయోగించుకునేవిధంగా అండగా నిలిచింది. అయితే 2023 జూలైలో ఆ ప్రభుత్వం చివరి సారిగా సాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలు చేస్తారో లేదో స్పష్టత లేకుండా పోయింది. 7 నెలలు గడుస్తున్నా నేతన్న నేస్తం అమలుపై సర్కారు నోరు మెదపడం లేదు. ప్రభుత్వం అందించే సాయం కోసం చేనేత కార్మికులు ఎదురుచూపులు చూస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని అమీనాబాద్, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, దుళ్ల, కడియం మండలం వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నమోదయివున్నారు. మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలున్నాయి.

ఎప్పుడిస్తారో.?

నష్టమైనా, కష్టమైనా చేనేతనే నమ్ముకుని అనేక మంది కార్మికులు కాస్తో కూస్తో కుటుంబాలను పోషించుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరి సరిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లగా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. ఉదాహరణకు పడుగు ధర రెండేళ్లతో పోల్చుకుంటే రెట్టింపు అయింది. కిలో పడుగు ధర రూ.5 వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. నేతకు ఉపయోగించే ముడి సరుకు ధరలు విపరీతంగా పెదరగడంతో గణనీయంగా ఉపాధి తగ్గిపోయిందని నేత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలీ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు కొందరికే దక్కుతుండడంతో మిగిలిన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి పూర్తి స్థాయిలో కార్మికులకు అందజేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

హామీలు అమలెప్పుడు.?

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వ నేతలు నేతన్న కుటుంబాలకు వరాల జల్లులు కురిపించారు. అనేక హామీలు ఇచ్చారు. వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన నారా లోకేష్ చేనేత కుటుంబాలకి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూతనందిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వారాహి యాత్ర సందర్భంగా పవన్ కళ్యాణ్ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చేనేత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేనేతను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నప్పటికీ గత ప్రభుత్వ అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నేతన్న కుటుంబాల పరంగా ప్రభుత్వం ఒక్క నిర్ణయాన్ని కూడా తీసుకున్న పరిస్థితి లేదు. ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని చేనేత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ సాయం లేక, నమ్ముకున్న చేనేత వృత్తి వదలలేక, వచ్చే నష్టాలను భరించలేక.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆయా కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని నేత కార్మికులు కోరుతున్నారు.

సాయం అందించాలి

గత సర్కారు నేతన్న నేస్తం పేరసాయం అందించేది. ఆ మొత్తాన్ని ముడి సరుకు ఇతర అవసరాలకు వాడుకునేందుకు ఉపయోగ పడేదేంది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కూడా సాయం అందిస్తానని చెప్పింది. కాని నేటికీ ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. వెంటనే సాయం అందించి నేతన్నలను ఆదుకోవాలి. హామీలను అమలు చేయాలి.

- ఎస్.నారాయణరావు, యు.కొత్తపల్లి

సరికొత్త ఆశలతో న్యూ ఇయర్

- సందడి నూతన ఏడాది ప్రారంభం
- వాణిజ్య సంస్థలు, హోటళ్లు, బేకరీల ఆఫర్లు
- ట్రెండ్‌కు అనుగుణంగా కేకులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కొత్త ఆశలతో... కోటి కాంతులతో నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం నుంచే ఎవరి నోట విన్నా ఒక్కటే మాట డిసెంబరు 31 నైట్ సెలబ్రేషన్స్ ఎక్కడ..?2024కి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికి జిల్లావ్యాప్తంగా సందడి చేశారు. ముఖ్యంగా యువత పార్టీలు అంటూ చేసిన సందడికి పోలీస్ బాస్‌లు అడ్డుకట్ట వేశారు. కోరుకొండలో రేవ్ పార్టీ కలకలం రావటం పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకోవటంతో ఆ తరహా పార్టీలు నిర్వహించే వారిలో వెన్నులో వణుకు పుట్టింది. దీంతో అక్కడక్కడా పార్టీలు జరిగినా ఊహించిన స్థాయిలో చేసేందుకు వెనకడగు వేశారు. మరికొద్ది మంది ఇంట్లోనే కుటుంబ సభ్యులతో న్యూ ఇయర్ వేడుకలు చేసుకున్నారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్‌లలో ప్రత్యేక సందడి నెలకొంది. న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని హోటళ్లకు రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, బేకరీలలో సందడి నెలకొంది. ఆఫర్‌లు ప్రకటించటంతో మరింత రద్దీ నెలకొంది. ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లుల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు రోజుల ముందునుంచే కావాల్సిన రంగులు బజార్లలో దర్శనమివడంతో విరివిగా కొనుగోళ్లు జరిగాయి. మరో వైపు రెస్టారెంట్‌లలో చికెన్, మటన్, ఫిష్ బిర్యానీలతో ఆటు జంబో ఫ్యామిలీ ప్యాక్‌లతో ఆఫర్లు ఇచ్చారు. మద్యం దుకాణాలు సైతం అదే స్థాయిలో దర్శనమిచ్చాయి. సాయంత్రం 6 గంటల నుంచే కిటకిటలాడాయి. ముఖ్యంగా యువత సంబరాల్లో ఎక్కువగా పాల్గొన్నారు. న్యూ ఇయర్ వేడుకలకు మార్కెట్లో సందడి నెలకొంది. మరోవైపు పూల మార్కెట్లలోనూ రద్దీ నెలకొంది. న్యూ ఇయర్ విషెష్ తెలిపేందుకు వినియోగించే బొకేలను మార్కెట్లో వివిధ డిజైన్లు కొనుగోలుదారులను ఆకర్షించాయి. ఒకప్పుడు కుటుంబ సభ్యులు ఏదైనా వేడుక జరుపుకోవాలంటే రక రకాల పిండి వంటలు తయారు చేసుకునేవారు. ఇపుడు ఆ ట్రెండ్ మారిపోయి కొత్త ట్రెండ్ నేటి తరం తెరతీశారు. ఇపుడు వేడుక ఏదైనా కేకు ఉండాల్సిందే అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. కేవలం బర్త్‌డేకే కాక చిన్నా, పెద్దా తారతమ్యాలు లేకుండా పెళ్లి రోజులు, రాజకీయ నాయకుల పుట్టిన రోజులు జయంతులకు సైతం కేకులను కట్ చేసి తమ అభిమానాన్ని వారి పట్ల చాటుకుంటున్నారు. ఈ కేకుల వాడకంతో బేకరీల యజమానులకు లాభాల పంట పడుతోంది. కస్టమర్ల ఆశలకు అనుగుణంగా అన్నింటికీ ఒకేలా కేక్ తయారు చేసే పద్ధతికి కూడా వారు స్వస్తి చెప్పేశారు. వినియోగదారుల రుచి అభిరుచులకు అనుగుణంగానే వివిధ ఆకృతులలో సృజనాత్మకతను పదును పెట్టి కేకులు తయారు చేస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలకు వివిధ రకాల అకారాల్ల కేకులను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది డ్రై ఫ్రూట్ కేక్, కూల్ కేక్ ఫొటో కేక్, హనీ కేక్ వంటి రకరకాల కేకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



నూతన సంవత్సర దినోత్సవాన్ని, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేళ అందరి కుటుంబాల్లో సంతోషాలు వెల్లి విరవాలని, ఆరోగ్యంతో వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు అందరూ చక్కగా చదువుకుని మార్చి నెలలో రాసే పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని అభిలషించారు. విద్యార్థుల భవిత చక్కగా ఉండాలని ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తోందని, వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈశ్వరరావు అక్రమ అరెస్టుకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో జీడిపిక్కల ఫ్యాక్టరీని మూసి వేసినందుకు నిరసనగా 45 రోజులుగా ఉద్యమిస్తున్న కార్మికుల పక్షాన నిలబడిన సిఐటియు నేత ఈశ్వరరావు అక్రమ అరెస్టును సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చర్చల కోసమని పిలిచి అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు.కార్మికుల సమస్య పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

యుటిఎఫ్ నూతన విద్యా సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను డిఇఒ కె.వాసుదేవరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిఖా బోధనకు డైరీ ఎంత ఆవశ్యకం అన్నారు. యుటిఎఫ్ తూర్పు గోదావరి జిల్లా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జయకర్, ఎ.షరీఫ్ నేతృత్వంలో డిఇఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.విజయ గౌరీ, జిల్లా కార్యదర్శులు సిహెచ్.దయానిధి, కె.రమేష్ బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, ఎన్.రవిబాబు, ప్రకాశరావు, యుటిఎఫ్ ప్రతినిధి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రబీ సాగుపై కలెక్టర్ సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రస్తుత రబీ సీజన్ పంటల సాగు విస్తీర్ణం, కార్యాచరణ ప్రణాళికపై క్షేత్ర స్థాయి అధికారులతో అంశాల వారీగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ విధానంలో మార్పులు, పంట మార్పు, ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచడం, అంతర పంటల సాగు చేపట్టడం ద్వారా మరింత సమర్థవంతంగా వ్యవసాయ దిగుబడులు సాధించడంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ విధానంలో మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు విజన్ డాక్యుమెంటరీ రూపొందించినట్లు తెలిపారు. వాటిని ఆచరణ సాధ్యం చెయ్యడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించడం కోసం సైద్ధాంతిక విధానంలో కాకుండా, ఆచరణాత్మక విధానంలో ఉండాలన్నారు. ఫసల్ బీమా యోజన పథకం అమలులో తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో మరింత సమర్థవంతంగా పనితీరు చూపడం ద్వారా రైతులకి మేలు కలుగచేసే విధానంపై అధ్యయనం చేసి ఆ మేరకు క్షేత్ర స్థాయిలో ఫలితాలను సాధించాలని గతంలో కోరడం, ఆ మేరకు విజన్ డాక్యుమెంటరీ సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. రానున్న వ్యవసాయ శాఖ సమీక్షలో ఆరు అంశాల ప్రగతి వివరాలపై సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, వ్యవసాయ సహాయ సంచాలకుడు బికె.మల్లికార్జున రావు, చంద్ర శేఖర్, ఇతర క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేపరు మిల్లులో కీచక అధికారి అరాచకాలు


సమావేశంలో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎంతో ఘన చరిత్ర కలిగిన రాజమండ్రి పేపర్ మిల్లులో ఒక ఉన్నతాధికారి అరాచకాలకు, కామవాంఛకు ఉద్యోగులు బలవుతున్నారని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 3 సంవత్సరాలుగా పేపర్ మిల్లులో జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలతో ఇందులో పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగులు అభద్రతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీలో ఉన్న ఒక ఉన్నత ఉద్యోగి అరాచకాలకు అంతు లేకుండాపోతోందన్నారు. అతడి వల్ల గత రెండేళ్లలో ఒక పర్మినెంట్ కార్మికుడు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు ఉద్యోగులు 40 ఏళ్ళు నిండకుండానే అర్ధాంతరంగా చనిపోయారంటే అతడి వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. మహిళా ఉద్యోగులు అతడికి కనపడడానికి భయపడుతున్నారని తెలిపారు. కొద్దికాలం క్రితం ఒక కాంట్రాక్ట్ మహిళా కార్మికురాలికి పర్మినెంట్ జాబ్ ఇస్తానని, ఇల్లు కొనిస్తానని చెప్పి ఆమె ఇంటికి వెళ్లి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. బాధితురాలు ఈ విషయాన్ని సంస్థలో సీనియర్ ఆఫీసర్స్‌కు తెలియజేసినా అతడికి భయపడి ఆమెకి ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. దీంతో ఆ మహిళా ఉద్యోగి బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 10న ఫిర్యాదు చేస్తే పలుకుబడి, డబ్బు ఉపయోగించి పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని తెలిపారు. ఇలాంటి కామాంధులను కంపెనీలో నుండి తొలగించి అక్కడ పనిచేసే మహిళలకి న్యాయం చేయకుంటే ప్రజలు, పేపరు మిల్లు కార్మికులతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామని కొండబాబు హెచ్చరించారు. ఈ సమావేశంలో గారా నూకరత్నం, ఆవాల సునీత, గారా కుమార్, బూసి సత్యనారాయణ, మారు జగదీష్, పెదపూడి లోవరాజు, దుర్గ, కె.సిద్ధు, జి.గోపి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంత్రి దుర్గేష్ పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, బిక్కవోలు


పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌దారులకు ఒకరోజు ముందుగానే హ్యాపీ న్యూ ఇయర్ వచ్చిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని పసలపూడిలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల నెలా రాష్ట్రంలో ఒకటవ తేదీన పింఛన్ల పంపిణీ పండుగ వస్తోందని, ఒకటవ తేదీ ఆదివారం, లేదా ఏదేని సెలవు దినం వస్తే, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెండో తేదీని కాకుండా, ఒకరోజు ముందుగానే రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వానికి కాళీ ఖజానా ఇచ్చినప్పటికీ సంక్షేమం, అభివద్ధి ఏమాత్రం కుంటు పడకుండా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ప్రజా సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్నారన్నారు.

బిక్కవోలు నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను 15 మంది లబ్ధిదారులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అందరికీ ఒకరోజు ముందుగానే పెన్షన్లు అందజేసినట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-బిక్కవోలు

మండలంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన బిక్కవోలు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆయన పాల్గొన్నారు. మండలంలోని సమస్యలపై వివిధ శాఖల అధికారులతో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మూడు జెడ్‌పి హెచ్ పాఠశాలల్లో ల్యాబ్ ఆన్ వీల్స్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, హైగ్లో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మూడు జడ్‌పి పాఠశాలలు మొదటి దశలో ఎంపికయ్యాయియ. సోమవారం శ్రీబొల్లి మునియ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెదుళ్ళపల్లి (సీతానగరం మండలం) విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం నుంచి విద్యార్థులు ఫిజిక్స్‌కు సంబంధించిన పరికరాలతో సిలబస్‌లోని అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తాము సిలబస్‌లో చదివిన అంశాలను ప్రత్యక్షంగా అనుభవపూర్వకంగా తెలుసుకున్నందుకు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కె అధ్యాపకులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీ గణపతిని దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి స్వామిని మంగళవారం కాకినాడ ట్రైనీ కలెక్టర్ భావన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. ఆమె వెంట బిక్కవోలు విఆర్‌ఒ అశోక్ కుమార్ ఉన్నారు.

ఏలూరు వెళ్లి పింఛను సొమ్ము అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి


ఏలూరు ఆసుపత్రిలో పింఛను అందిస్తున్న సిబ్బంది

అనారోగ్యంతో ఉంటూ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మలకపల్లికి చెందిన తోపు కృష్ణవేణికి రెండు నెలల పింఛున రూ.8 వేలను మలకపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చైతన్య, సర్వేయర్ నాగేంద్ర మంగళవారం ఏలూరు వెళ్లి లబ్ధిదారునికి అందజేశారు. ఈ క్రమంలో సిబ్బందిని సర్పంచ్ రాపాక రాజేశ్వరి, కూటమి నాయకులు, గ్రామ కార్యదర్శి కామేశ్వరి అభినందించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉండ్రాజవరం 2024 పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ, 2025 నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలికేందుకు మండలంలో ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇళ్లు, వాకిళ్లు, దుకాణాలు, పరిశ్రమల ముంగిట మహిళలు రంగురంగుల రంగవల్లుల అద్దుతూ, ముత్యాల ముగ్గులు వేస్తూ ముస్తాబు చేస్తున్నారు. న్యూ ఇయర్ కేకులు, పువ్వులు, ఫ్లవర్ బొకేలు, మిఠాయిలు, పండ్లు, ముత్యాల ముగ్గులకు రంగులు, ప్రత్యేక కుండ బిర్యానీలు, చికెన్ కబాబులు అమ్మే దుకాణాలన్నీ , కొనుగోలుదారులతో కళకళలాడాయి. నిబంధనలు పాటిస్తూ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు ప్రజలకు పిలుపునిచ్చారు.


తాళ్లపూడిలో కిటకిటలాడుతున్న బజారు

తాళ్లపూడి నూతన సంవత్సర వేడుకలకు ప్రజలు ముఖ్యంగా యువతీ యువకులు సిద్ధమైన వేళ వివిధ రకాల వస్తువుల కొనుగోలుదారులతో తాళ్లపూడి మెయిన్ బజార్ కిటకిటలాడింది. అసలే ఇరుకుగా ఉండే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పూలు, పళ్ల రంగవల్లులు అమ్మకాలు సాగించే షాపులు వేయడంతో ఈ మెయిన్ బజార్ మరింత ఇరుకుగా మారి పాదచారులు సైతం నడవడానికి ఇబ్బంది పడ్డారు. వీటికి తోడు నూతన సంవత్సర కేకుల షాపులతో పాటు ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అంటూ బిర్యానీ అమ్మకాలు సాగించే షాపులు కూడా రోడ్డుపై వెలిసాయి.

నల్లజర్ల మండల కేంద్రమైన నల్లజర్లలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కంటమణి శ్రీనివాసరావు కో-ఆపరేటివ్ కళాశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కళాశాల చైర్మన్ కంటమణి వసుంధర దేవి మాట్లాడుతూ సాంప్రదాయాలను చిరకాలం నిలుపుకోవాలని రాబోయే తరం వారికి సంక్రాంతిపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆమె ముగ్గుల పోటీలలో గెలుపొందిన కళాశాల విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజయ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నల్లజర్లలో పార్డ్ ఇండియా ఆధ్వర్యాన న్యూ ఇయర్ వేడుకలు

పార్డ్ ఇండియా ఇరకాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న పుల్లలపాడు, నల్లజర్ల ఎంపిపి స్కూల్స్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్డ్ ఇండియా, జయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్యర్యంలో నడుపుతున్న కుట్టు మిషన్ కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ అంబటి శ్రీనివాసరావు, నల్లజర్ల మండల పార్డ్ ఇండియా కమిటీ సభ్యుల ఆధ్యర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీతారాములు, అల్లూరి హరిచంద్రరావు, కె.లక్ష్మణ్ రావు, ఎమ్.మోహన్, బలుసు సిద్ధార్థ, పార్డ్ ఇండియా సభ్యులు చీమకుర్తి కృష్ణ ప్రసాద్, మహమ్మద్ ఇలియా షరీఫ్, బొందల శ్రీనివాస్, కూరపాటి నాగరాజు, రాంబాబు, వెంకట్రావు, హేమ కుమార్, పావని, మరియమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి టిఎస్‌ఆర్.ప్రసాద్

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్ట్ సొత్తు స్వాధీనం

ప్రజాశకి - ముమ్మిడివరం

అంతర జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బంగారం, వెండి, మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అమలాపురం డిఎస్‌పి టిఎస్‌ఆర్ కె.ప్రసాద్ తెలిపారు. ముమ్మిడివరం సిఐ కార్యాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ ఐ పోలవరం మండలం వడ్డి చెరువుకు చెందిన ఓలేటి మహాలచ్చారావు, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం చిన్న మల్లం కు చెందిన గెద్దాడ సురేంద్ర, పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన పొట్టు పోతుల ఉదయ్ కుమార్ లు అనుమానాస్పదంగా లక్ష్మీదేవి లంక వద్ద తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారన్నారు. ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, అయినవిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, మొత్తం ఏడు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 277.1 గ్రాముల బంగారం, కేజీ 1.215 గ్రాముల వెండి, రెండు మోటార్ సైకిల్ పల్సర్, సుజుకి యాక్సెస్ , మూడు సెల్ ఫోన్లు మొత్తం విలువ రూ.23 లక్షల 30 వేల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌ప్పి తెలిపారు. నిందితులు వ్యసనాలకు బానిసై ఈజీ మనీకి అలవాటు పడి ఈ దొంగతనాలు పాల్పడుతున్నారని డిఎస్‌పి వివరించారు. నిందితులను దుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు వెండి వస్తువులు మోటార్ సైకిళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి వివరించారు. చోరీ కేసును అత్యంత చాక చక్యంగా చేదించిన సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్, సిబ్బందిని ఎస్‌పి కృష్ణారావు ఈ సందర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ లు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటారు బైక్ పై వెళ్తూ ప్రమాద వశాత్తు చెట్టుని ఢీ కొట్టి అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో పడి గల్లంతయిన యువకుడి మృతదేహం గత నెల 30వతేదీ రాత్రి లభ్యమైంది. దీనికి సంబంధించి మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పలగుప్తం మండలం కామరాజుపేటకు చెందిన పెయ్యల స్టీఫిన్, ధోనిపాటి అభిషేక్(23) యానాం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ సమయంలో ప్రమాద వశాత్తు మురమళ్ల పల్లంకుర్రు ఏటిగట్టు రోడ్డులో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ప్రమాదవశాత్తూ అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో అభిషేక్ పడి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా గత నెల 30న మృతదేహం లభ్యమయింది. ఈ ప్రమాదంలో మరో యువకుడు స్టీఫెన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు ఎస్‌ఐ డి జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అయినాపురం గ్రామానికి చెందిన వివాహిత మట్ట వీరవేణి (30) కుటుంబ కలహాలతో గత నెల 30వ తేదీ రాత్రి ఇంట్లో ఉరెసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త సత్యనారాయణ గౌడ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలో 8406 మంది పింఛన్‌దారులకు మంగళవారం తెల్లవారు జాము నుంచే అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా 95.50 శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు. ఇదిలావుంటే నీలాద్రిపేటలో విఆర్‌ఒ సమయానికి రాకపోవడంతో పింఛన్‌దారులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. **కరప** మండలంలోని 23 గ్రామాల్లోని సుమారు 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సాగర్ పింఛన్లు అందజేశారు. పటవల, .పటవల సర్పంచ్ చినకామేశ్వరరావు, కూటమి నాయకులు నడింపల్లి వినోద్, భజన సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, వాకపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

కళాశాలకు భవనం నిర్మించాలి

గొల్లప్రోలు : ప్రభుత్వ జూనియర్ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం జూనియర్ కాలేజీ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా పరిరక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అందరికీ విద్య ఉపాధి అవకాశాల కోసం పోరాడుతుందన్నారు. కళాశాలకు సొంత భవనం నిర్మించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత కళాశాల ఆవరణలోఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు వర్షిని కార్యదర్శి వడ్డికాసులు ఆవిష్కరించారు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పెరవలి

ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మార్టేరు ప్రక్కిలంక ఆర్ అండ్ బి రహదారి మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.కోటీ 17 లక్షలు మంజూరు చేశామన్నారు. ఉసులుమర్రు, కానూరు మధ్య 1700 మీటర్ల పొడవునా మూడు చోట్ల రూ.3 కోట్ల 80 లక్షలతో సిమెంట్ రోడ్డు వేయడానికి అంచనాలు తయారు చేశామని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో మంజూరు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల అధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ (శ్రీను) పిప్పర రవి కుమార్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూప్ కుమార్, డిఇ వెంకటరమణ, ఎఇ శ్రీనివాస్, విజయ్, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, సలాది శ్రీహరి, హనుమంతు సుబ్రమణ్యం, నాగిరెడ్డి నాగేశ్వరావు, నందిప శ్రీనివాస చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పసలపూడిలో మంత్రి కందుల దుర్గేష్ ఎస్‌టియు డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్‌టియు రాష్ట్రంలో అతి పెద్ద సంఘమని, ప్రభుత్వానికి వ్యవస్థాపక నిర్ణయాల్లో సూచనలు ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు మండల అధ్యక్షులు నిరీక్షణ రాజు, ప్రధాన కార్యదర్శి బిఆర్‌ఎల్.మూర్తి, ఆర్థిక కార్యదర్శి కాశీ విశ్వనాథ్, సభ్యులు ఎస్‌డి.శ్రీనివాస్, తమ్మిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా పుణ్యక్షేత్రం అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రచురించిన నూతన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎం.రాధాకృష్ణ, గ్రామ ఎంపిటిసి ఆకుల సుబ్బారాయుడు, ఆలయ అర్చకులు వాడపల్లి కేశవాచార్యులు, బొలిశెట్టి ప్రసాద్, ఓసూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రమే మూలం

ప్రజాశక్తి-కడియం

మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రవే మూలమని విద్యార్థులు శాస్త్రీయ దక్పథం కలిగి ఉండాలని కడియం ఎంఇఒ కె.నాగేశ్వరరావు అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ కార్యక్రమం హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలు పాల్గొన్నాయి. మొత్తం 30 అంశాలు ప్రదర్శింపగా, విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో కృష్ణచైతన్య (దుళ్ళ) ప్రథమం, జి.మణికంఠ గుప్తా (వేమగిరి) ద్వితీయం, విద్యార్థుల బందం విభాగంలో బి.మణికంఠ, ఫణీంద్ర ప్రథమం (జేగురుపాడు) ఎం.పవిత్ర, ఎం.ఐశ్వర్య (కడియం) ద్వితీయం, టీచర్ విభాగంలో జిఎస్‌ఎన్.మూర్తి (వీరవరం) ప్రథమం, ప్రకాష్ (వేమగిరితోట) ద్వితీయం సాధించారు.



విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సత్యదేవ నర్సరీలో ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్

ప్రజాశక్తి-కడియం

కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ అధినేత పుల్లా పెద్ద సత్యనారాయణ డాక్టర్ ప్రియాంకకు మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కల గురించి ఆమెకు వివరించారు. కో ఆర్డినేటర్ వెంట సిబ్బంది సూరిబాబు, నాగిరెడ్డి రామకృష్ణ ఉన్నారు.



డాక్టర్ ప్రియాంకకు మొక్కను అందజేస్తున్న నర్సరీ అధినేత

నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా?

ప్రజాశక్తి - పిఠాపురం



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సంతాపం తెలుపుతున్న సభ్యులు

కూటమి ప్రభుత్వం అధికారంకొచ్చి ఏడు నెలల గడుస్తున్నా మున్సిపాలిటీ అభివృద్ధికి రూపాయి కూడా కేటాయించలేదని పలువురు వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజక వర్గంలోని మున్సిపాలిటీకి నిధులు లేవంటూ అధికారులు చెబుతున్నారన్నారు. ఇలా అయితే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధరణ సమావేశం చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం సభ ప్రారంభమైంది. జనరల్ ఫండ్ కేటాయించిన పనులు పూర్తి కాకపోవడంపై కమిషనర్‌ను నిలదీశారు. గతంలో ర్యాటిఫికేషన్ చేయొద్దని చెప్పి, ఆ పనులు మళ్లీ అజెండాలోకి ఎలా తెచ్చారని కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరి, సోమరౌతు లలిత ప్రశ్నించారు. అత్యవసర పనులు కొన్నింటిని ఎజెండాలో చేర్చామని,త్వరలో రూ.2కోట్ల నిధుల విడుదలతో పాటూ, మూడు వార్డులకు సంబంధించిన రూ.20 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కాంట్రాక్టర్ సూరవరపు దివాణాన్ని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టలేదని నిలదీశారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయనకు నోటీసులు ఇచ్చామని, 15 రోజుల్లో కాంట్రాక్టర్ నుంచి లిఖిత పూర్వక సమాధానం స్వీకరించి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఇరువురికి వాగ్వాదం జరిగింది. మినిట్స్ బుక్స్‌లో అవకతవకలపై విచారణపై సభ్యులు ప్రస్తావించారు. ఆ ఉద్యోగికి ప్రస్తుతం బదిలీపై వేరే మున్సిపాల్టీకి వెళ్లారని త్వరలో పిలిపించి వివరణ తీసుకుంటానని కమిసనర్ తెలిపరాఉ. కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో సాధారణ నిధులు తప్పితే ఆయన మున్సిపాల్టీకి చేసిందేమి లేదని విమర్శించారు. 7 నెలలు గడుస్తున్న ఒక్కసారి కూడా ఉప ముఖ్యమంత్రి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాలేదని వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మెమెంటో అందుకుంటున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

పెరవలి పోలీస్ స్టేషన్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-పెరవలి

జిల్లాలో అత్యున్నత ప్రగతిని కనబరిచిన పోలీస్ స్టేషన్‌గా పెరవలి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి డి.నరసింహ కిషోర్ ఎంపిక చేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన క్రైమ్ మీటింగ్‌లో పెరవలి ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావుకు మెమెంటో అందజేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, రికార్డులు, కేసుల పురోగతి, ఫిర్యాదుల స్వీకరణ తదితర విషయాల్లో గుర్తించి జిల్లా స్థాయిలో పెరవలి పోలీస్ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది.

పోషణ వాటికపై అవగాహన

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సెక్టార్‌లో అంగన్వాడీ సెంటర్‌లో మంగళవారం పోషణ వాటిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ ఆకుకూరలను రసాయన ఎరువులతో కాకుండా సేంద్రియ ఎరువులతో మాత్రమే పెంచిన ఆకుకూరలను మూడు సెంటర్లకు సంబంధించిన తల్లులకు ఎంపిడిఒ ఎం.గోవింద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయంత రాజు, ఎసిడిపిఒ వరలక్ష్మి, సెక్టర్ సూపర్వైజర్స్ పి.ఇందిరా రాణి, చంద్రమ్మ, రంజని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు,

వాలీబాల్ పోటీలకు సుధీర్ ఎంపిక

ప్రజాశక్తి-బిక్కవోలు

జాతీయ స్థాయి సీనియర్స్ వాలీబాల్ (మెన్) పోటీలకు బిక్కవోలు గ్రామానికి చెందిన సతరాపు సుధీర్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్‌ను ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సత్కరించి అభినందించారు.

ఎంఎల్‌ఎ నెహ్రూకు సత్తిబాబు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సొసైటీకి తనను చైర్మన్‌గా ప్రకటించడంపై గాజింగం సత్తిబాబు మంగళవారం ఎంఎల్‌ఎ నెహ్రూను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్‌ఎను సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ నెహ్రూ ఆశీస్సులతో నాకు ఈ అవకాశం దక్కిందని, కష్టపడిన ప్రతి నాయకునికీ, కార్యకర్తకూ ఎంఎల్‌ఎ నెహ్రూ సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు, భరత్ బాబు, దాసరి సతీష్, పోసిన ప్రసాద్, మంగరాతి శ్రీనివాస్, పెద్దాడ వెంకన్న దొర, అరిసెపు రాంబాబు, చింతల రవికాంత్, పప్పుల శ్రీధర్, రాయి వీర భద్రం, బొర్రా రాజేష్, కర్రి శివ పాల్గొన్నారు.

మద్యం లేని వేడుకలు జరుపుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యం లేని నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని డాక్టర్ సిహెచ్.వరలక్ష్మి అన్నారు. మంగళవారం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వరలక్ష్మి హాస్పిటల్‌లో డాక్టర్ సిహెచ్.వరలక్ష్మి చేతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, మాదకద్రవ్యాలు రహిత నూతన సంవత్సర వేడుకలు అందరూ జరుపుకోవాలని అన్నారు. మద్యం రహిత సమాజ స్థాపనలో యువత భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, కరణం శ్రీనివాస్, అడ్వకేట్ ఆర్‌వి.రమణారావు, విశ్వనాథ్, ల్యాబ్ శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక నాయకులు సిహెచ్.పావని , సిహెచ్.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో స్వాగతం పలకాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరు నూతన ఆలోచనలతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఎస్‌ఐ మౌనిక అన్నారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక, చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్‌ఐ మాట్లాడారు. న్యూఇయర్ వేడుకల్లో మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రవివర్మ, చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి అరుణ్‌కుమార్, ప్రజానాట్య మండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ, ఆర్.వీర్రాజు, మిషన్ అన్నపూర్ణ సహాయనిధి పౌండర్ దేవత రాజేష్‌కుమార్, మంజుల, అమృత, నమ్రత, హాసిని, కూనిరెడ్డి పవన్, ధర్మ, బంగారు రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

2 నుంచి క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో సాంప్రదాయ క్రీడోత్సవాలను ఈ నెల 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాలకు చెందిన గ్రామీణ యువతతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జనవరి 2 నుంచి 7 వరకూ ఈ క్రీడలు జరుగుతాయని తెలిపారు. గ్రామీణ యువతను జూదాల వైపుకు మళ్ళ కుండా చూచే లక్ష్యంతో గ్రామీణ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ (మహిళలు): 25 ఏళ్లలోపు వారు ఉండాలన్నారు. ముగ్గులు పోటీలు, త్రో బాల్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ పోటీల్లో మహిళలు పాల్గొన్నారు.

యానాం వార్తలు



యూత్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

ఘనంగా యూత్ క్రిస్మస్

ప్రజాశక్తి - యానాం

యానాం యూత్ క్రిస్మస్ వేడుకలు స్థానిక బస్ కాంప్లెక్స్ ఆవరణలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా జరిగింది. యానాం క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు.ఈ వేడుకల్లో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్ వెస్లీ పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అనంతరం క్రిస్మస్ కేకును ప్రతినిధులతో కలిసి కట్ చేశారు. ఇవాంజలిస్ట్ మారెళ్ల స్టీవెన్, తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నాగూర్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీస్ శాఖలో స్పెషల్ గ్రేడ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఎలుగోటి నాగూర్ సేవలు ప్రశంసనీయమైనవని ఎస్‌పి రాజశేఖరన్ అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్ బీచ్ పరిధిలో వెంకరత్నం నగర్లో నాగూర్ దంపతులను పోలీస్ శాఖ, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్ గార్డు నుంచి కానిస్టేబుల్, హెచ్‌సి, ఎఎస్‌ఐగా వివిధ హోదాల్లో సుమారు 36 ఏళ్లపాటు క్రమశిక్షణతో సేవలు అందించారని అన్నారు. భవిష్యత్ జీవితం ఆనందమయంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పలువురు నాగూర్, మీరాబీ దంపతులను దుస్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, కానిస్టేబుల్స్, హోమ్ గార్డులు పాల్గొన్నారు.

కవి దాట్లకు స్మారక అవార్డు

ప్రజాశక్తి - యానాం

యానాంకు చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు తటవర్తి భారతి స్మారక పురస్కారం అందుకున్నారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయం సమావేశ మందిరంలో మేడా మస్తాన్ రెడ్డి బృందం ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సభలో దాట్లకు జెఎస్‌ఎన్.రాజు, బాల మోహన్‌దాస్, బేతవోలు రామబ్రహ్మం, నాగేశ్వరరావుల చేతుల మీదుగా పురస్కారంను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దాట్లను ఘనంగా సత్కరించి నగదు, మెమెంటో అందించి అభినందించారు.

ఈశ్వరరావు అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - పిఠాపురం, పెద్దాపురం

సిఐటియు ఏలేశ్వరం నాయకులు ఆర్.ఈశ్వరరావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని పిఠాపురం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కరణం విశ్వనాథం, కె చిన్న మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. సుమారు 46 రోజులుగా ఏలేశ్వరం మండలం చిన్నంపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతోనే తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించి ధర్నా చేపట్టారని తెలిపారు. కార్మికులకు అండగా ఉన్న సిఐటియు నాయకుడు ఈశ్వరరావును పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్ట్ చేసిన ఈశ్వర్ రావును తక్షణం భేషరతుగా విడుదల చేయాలని సిఐటియు పెద్దాపురం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ మాట్లాడారు. చర్చలు పేరుతో పిలిచి అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

శ్రీ ప్రకాష్‌లో ఎన్ఇపిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కోటనందూరు

స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో జాతీయ విద్యా విధానం-20(ఎన్ఇపి)పై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో విపిఎం అకాడమీ అఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ప్రొఫెసర్ సుధాకర్ సి.అగార్కర్ పాల్గొని మాట్లాడారు. సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు, నిష్పాక్షికమైన, న్యాయ బద్ధమైన సమాజాన్ని స్థాపించేందుకు జాతీయ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యే మౌలికమైనదని అన్నారు. విద్యా వ్యవస్థ మౌలిక సంస్కరణల్లో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా ఉండాలని, అన్ని స్థాయిల్లో చురుకుతనం, తెలివి కలిగిన వారు బోధన వృత్తిలో ప్రవేశించే విధంగా వారి జీవనోపాధి, గౌరవం, స్వయం ప్రతిపత్తి లకు భరోసా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎఆర్‌కె.రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, పాల్గొన్నారు.

సిపిఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర ప్రజలకు సిపిఎం నగర కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని సిపిఎం ఆకాంక్షిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలని, నిత్యావసర సరుకుల ధరలు అదుపులో ఉంచాలని, యువతకు ఉపాధి కల్పించాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. 2025లో అయినా కాకినాడ నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించి ప్రజాపాలన సాగించాలన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థుల ఉన్నతికి పాఠశాలల నిర్వహణా కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు కృషి చేయాలని డిఇఒ పిల్లి రమేష్ సూచించారు. మంగళవారం స్థానిక శాలిపేట మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో అర్బన్ మండలంలోనిపాఠశాల నిర్వహణా కమిటీల ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం లక్ష్యాన్ని, ప్రభుత్వ పాఠశాలలకు అందుబాటులో ఉన్న నిధులు, వనరులను ఉపయోగించుకుని అనుభవం కలిగి ఉన్న ఉపాధ్యాయులను ఉపయోగించుకుని విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలన్నారు. శిక్షణ పొందుతున్న పాఠశాల నిర్వహణ కమిటి అధ్యక్షుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జనవరి 4వ తేదీన పాఠశాల స్థాయిలో పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంఇఒలు కెవి.సత్యనారాయణ, చెవ్వూరి రవి తెలిపారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు, సిఎంఒ చామర్తి నాగేశ్వరరావు మాట్లాడారు.

ఆదాయ వనరుల పెంపుపై అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ ఆదాయ వనరుల పెంపుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆకుల కష్ణ బాబుజి, త్సలికి సత్య భాస్కర రావు, పప్పల దుర్గ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నా రన్నారు. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు వినాయకుని గుడిసెంటర్లో పాత షాపింగ్ కాంప్లెక్స్‌ను పడగొట్టేసిన స్థలంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ కడితే రూ.కోటికి పైగా ఆదాయం లభిం చేదన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో భాగ్యశ్రీ ప్రైవేటు గ్యాస్ కంపెనీ 52 కిలోమీటర్ల మేర గ్యాస్ పైపులైను కోసం తవ్వకాలు జరిపిందన్నారు. ఈ కంపెనీ నుంచి చలానా కట్టించాలన్నారు. అనధికార కులాయి కనెక్షన్లపై దృష్టి సారిస్తే మున్సిపాలిటీకి ఎంతో ఆదాయం లభించేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తులసి మంగతాయారు స్పందిస్తూ ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.